క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వంట, శానిటేషన్ కార్మికులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో వంట, శానిటేషన్ మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద పాఠశాలల్లో పనిచేస్తున్న వంట, శానిటేషన్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ.. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వంట, శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని కోరారు. రాజకీయ వేధింపులు, తొలగింపులు లేకుండా చూడాలని, కార్మికులకు పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. ఏడాదికి రెండు జతల దుస్తులు, బీమా సదపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేష్‌బాబు మాట్లాడుతూ గౌరవ వేతనం రూ.20 వేలు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీని పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, 12 నెలలకూ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంట, శానిటేషన్ కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతులందరికీ ఎరువులు అందడం లేదు

- మండల సమావేశంలో పలువురి సభ్యుల ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సారవకోట: రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న ఎరువులు రైతులందరికీ సక్రమంగా అందడం లేదని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూరియా అవసరం మేరకు పంపిణీ చేయడం లేదని అధికారులను సభ్యులు ప్రశ్నించారు. ఎకరా పొలం ఉన్న రైతుకు అర బస్తా పంపిణీ చేస్తున్నారని, దీని వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పలు ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను అధికారులు వివరించారు. ఇదిఇలా ఉండగా ప్రతీ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే, ఎంపీపీతోపాటు డయాస్ పైకి వైస్ ఎంపీపీలను పిలిచేవారు. కానీ ఈ సర్వసభ్య సమావేశంలో డయాస్ పైకి వైస్ ఎంపీపీలు, పీఏసీఎస్ చైర్మన్లను పిలవకపోవడంతో వారు విస్మయం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించిన వైస్ ఎంపీపీ గుణుపురం రామారావుకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మండల ప్రత్యేకాధికారి లోకనాథం, ఎంపీడీఓ మోహన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు



ఆమదాలవలస: రైల్వే స్టేషన్ కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న యువకులు

ఆమదాలవలస: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ధనుంజయరావు అన్నారు. శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిషేధంపై రైల్వే స్టేషన్ జంక్షన్ నుంచి వన్‌వే జంక్షన్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.
కొత్తూరు: మండల కేంద్రంలో పీఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్లు కూడలి వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.
హిరమండలం: నాషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హిరమండలం పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు కొత్తూరు సీఐ ప్రసాద్, హిరమండలం ఎస్ఐ ఎండీ యాసిన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్ ఆవరణలో మానవహారం చేపట్టారు, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కావద్దంటూ నినాదాలు చేశారు.



హిరమండలం: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, యువకులు

కొందరికే అన్నదాత సుఖీభవ..!

- అర్హులకు దరిచేరని పథకం
- నేటికీ రైతుల ఖాతాలకు జమకాని నగదు
- బ్యాంకులు, ఆర్ఎస్‌కేల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు



ఉబాలు వేస్తున్న మహిళా రైతులు

నరసన్నపేట: అన్నదాతలను ఆదుకునేందుకు పెట్టుబడి సాయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు కొంతమంది రైతులకే అందింది. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదును జమ చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించాయి. నేటికీ అనేక మంది రైతులకు డబ్బులు జమకాలేదు. పలువురు రైతులు బ్యాంకులు, గ్రామ సచివాలయల చుట్టూ తిరుగుతున్నారు.

అనేక మందికి జమకాని వైనం..

నరసన్నపేట నియోజకవర్గంలోని జలుమూరు, పోలాకి, సారవకోట, నరసన్నపేట మండలాల్లో భూమి సాగు చేస్తున్న రైతులకు.. అన్నదాత సుఖీభవ నగదు జమైన రైతులకు పొంతన లేదు. అనేక మందికి నేటికీ అన్నదాత సుఖీభవ డబ్బులు జమకాలేదు. పీఎం కిసాన్ రూ.2 వేలు జమైన వారిలో చాలా మందికి అన్నదాత సుఖీభవ రాలేదు. చాలామంది రైతులకు పీఎం కిసాన్ డబ్బు జమకాలేదు. జాబితాల్లో అర్హులుగా రైతుల పేర్లు ఉన్నప్పటికీ డబ్బులు జమకాక పోవడం పట్ల ఆందోళన చెందుతున్నారు. అర్హత కలిగిన రైతులందరికీ పెట్టుబడి సహాయంగా మొదటి విడతగా రూ.7 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పలువురి ఖాతాల్లో రూ.2 వేలే జమకావడంతో నిరాశ చెందుతున్నారు. ప్రకటనలకు డబ్బుల జమకు పొంతనలేదని మండిపడుతున్నారు. సచివాలయాలకు వచ్చిన అర్హత కలిగిన జాబితాలో పేర్లు ఉన్న రైతులకు నిధులు జమకాలేదని పలువురు రైతులు వాపోతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పొందిన రైతుల వివరాలు ఇలా..

మండలం	రైతులు	అన్నదాత సుఖీభవ పొందిన రైతులు	రైతు భరోసా పొందిన రైతులు
నరసన్నపేట	13,184	8,430	8,903
జలుమూరు	16,153	9,892	10,665
సారవకోట	11,791	8,961	9,180
పోలాకి	13,370	10,458	1,1481

అర్హుల జాబితాలో పేరుంది..



గడిచిన ప్రభుత్వ కాలంలో ఐదేళ్లు రైతు భరోసా నిధులు జమయ్యాయి. పీఎం కిసాన్ నిధులు కూడా వచ్చాయి. ఇప్పుడు పీఎం కిసాన్ నిధులు జమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ డబ్బులు రాలేదు. అర్హుల జాబితాలో పేరు ఉన్నప్పటికీ డబ్బులు జమకాలేదు. బ్యాంకుకు వెళ్లినా ప్రయోజనం లేదు. అధికారులు పట్టించుకోవడం లేదు.

– జల్లు నర్సింహమూర్తి, బాలసీమ

అన్నదాత సుఖీభవ రాలేదు



గత ప్రభుత్వ కాలంలో రైతు భరోసా జమయ్యేది. ఇప్పుడు అన్నదాత సుఖీభవ జమకాలేదు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ రెండూ జమకాలేదు. ఏమని ప్రశ్నిస్తే సిబ్బంది నుంచి సరైన సమాధానం రావడం లేదు. అప్పుడు అర్హత ఉండి.. ఇప్పుడు కాక పోవడానికి కారణాలు అర్థం కావడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బొబ్బాది పెంటమ్మ, గోపాలపెంట

20 వరకు చేసుకోవచ్చు



అర్హత ఉండి అన్నదాత సుఖీభవ డబ్బులు జమకాని రైతులు ఈ నెల 20వ తేదీ లోగా సచివాలయాల్లో గ్రీవెన్స్(దరఖాస్తు) పెట్టుకోవచ్చు. ఇప్పటివరకు నరసన్నపేట నియోజకవర్గంలో 171 మంది రైతులు గ్రీవెన్స్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేశారు. మిగిలిన రైతులు అర్హత ఉండి పథకం రాకపోతే దరఖాస్తు చేసుకోవచ్చు.

– వెంకట మధు, ఏడీ, నరసన్నపేట

మోసమే చంద్రబాబు నైజం



చిన్నలంకాంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, నాయకులు

బూర్జ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి నయవంచన పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని గుత్తావల్లి, చిన్నలంకాం, పెద్దలంకాం, డొంకలపర్త గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు ఆధ్వర్యంలో శనివారం మండల నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు సీఎం చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్‌తోపాటు అనేక హామీలను కూటమి నాయకులు ఇచ్చారని, వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. సంక్షేమ పథకాల్లో కూడా భారీగా కోత విధించారన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను వివరించి క్యూ ఆర్ కోడ్‌ను అందించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితులు కర్నేన నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణమూర్తి నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మామిడివలస ఎంపీటీసీ గుమ్మడి రాంబాబు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్, మండల యువజన అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, సర్పంచ్ బిర్లంగి వరహాలునాయుడు, స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు బొడ్డేపల్లి నారాయణమూర్తి, బొడ్డేపల్లి నాగరాజు,జి. కృష్ణ, కొంచాడ రాము, పప్పల వెంకటరమణ, మజ్జి నర్సింగరావు, సీర రంగారావు, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛనే ఆధారం



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి జలుమూరు మండలం మాకివలస గ్రామానికి చెందిన దివ్యాంగుడు పల్లి అప్పలనాయుడు. ఈయనకు 2014 నుంచి దివ్యాంగ పింఛన్ వస్తోంది. రెండు చేతులు పూర్తిగా పనిచేయవు. చిన్న పని చేయాలన్నా కుటుంబ సభ్యులపైనే ఆధారపడుతున్నాడు. ఈయనకు దివ్యాంగత్వం తక్కువగా ఉందని, అందువల్ల పింఛన్‌ను తీసివేయడం జరుగుతుందని ఇటీవల సచివాలయ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. 80 శాతం పీహెచ్‌సీ సర్టిఫికెట్ ఉన్నా.. పింఛన్‌ను తొలగిస్తామని నోటీసులు అందాయి. ఉన్న అధారం పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణను పారదర్శకంగా చేపట్టాలని వేడుకుంటున్నాడు.

-జలుమూరు

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..



జలుమూరు: శ్రీముఖలింగంలో గోపూజ చేస్తున్న అర్చకులు

కృష్ణాష్టమి పర్వదినాన్ని భక్తులు శనివారం సందడిగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లోనూ ఆధ్యాత్మికశోభ నెలకొంది. వేకువజాము నుంచే ఆలయాల్లో విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టికొట్టే సంబరంలో చిన్నారులు, యువకులు సందడి చేశారు. సాయంత్రం భజనలు చేస్తూ తిరువీధి చేపట్టారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఊయలలో ఊగుతూ మురిసిపోయారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



సారవకోట: కృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు



పాతపట్నం: పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయం వద్ద కృష్ణుడుకి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



హిరమండలం: కూర్మ గ్రామంలో పూజలందుకుంటున్న రాధాకృష్ణులు



కొత్తూరు: బ్రహ్మకుమారి ధ్యాన మందిరంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో విద్యార్థులు



హిరమండలం: కూర్మ గ్రామంలో హాజరైన భక్తులు



జలుమూరు: రాధా గోవింద స్వామి మఠంలో కృష్ణునికి ఊయలలో వేసి పాటలు పాడుతున్న అర్చకులు, భక్తులు



బూర్జ: ఉప్పినివలసలోని సీతారామాలయం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు



ఆమదాలవలస: గేటు ప్రాంతంలో కృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కృష్ణదాస్‌ను కలిసిన అదీప్ రాజు



అదీప్‌రాజ్‌ను సత్కరిస్తున్న ధర్మాన కృష్ణదాస్, కృష్ణచైతన్య, యువజన విభాగం ప్రతినిధులు

నరసన్నపేట: మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజు శనివారం పోలాకి మండలంలోని మబగాంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో పార్టీ యువజన విభాగం పటిష్టతపై చర్చించారు. శ్రీకాకుళం జిల్లాలో యువజన విభాగం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజును ధర్మాన కృష్ణచైతన్య, తదితరులు సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, యువజన విభాగం కార్యదర్శి చింతు రాఘవరావు, పార్టీ యువజన విభాగం ప్రతినిధులు చక్రవర్తి, పాగోటి గోవిందరావు, దండి జయప్రకాశ్, చిన్ని జోగారావు, రెంటి కోట త్రినాథరావు, బుద్దల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక..



తమ్మినేనికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదీప్ రాజ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా అదీప్ రాజు మాట్లాడుతూ పార్టీ విజయం కోసం అందరం కలిసి కట్టుగా పని చేద్దామన్నారు. తమ్మినేని చిరంజీవినాగ్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వి. స్వరూప్, తదితరులు ఉన్నారు.

కూటమిది రైతు వ్యతిరేక పాలన

- వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి



హిరమండలం: కూటమి ప్రభుత్వం రైతులను దారుణంగా వంచించిందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అని చెప్పారని.. అందుకే ఇప్పుడు రైతుల పట్ల అదే భావన కనబరుస్తున్నారని ఆరోపించారు. పంటల బీమాకు మంగళం పలకడం అన్యాయమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్షపాతిగా ఎన్నో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగా రైతులకు వైఎస్సార్ పంటల బీమా ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని తెలిపారు. దేశంలోనే ఇది ఆదర్శ పథకంగా గుర్తించి అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ అవార్డు ఇచ్చిందన్నారు. ఈ ప్రభుత్వం పంటల బీమా పథకానికి మంగళం పలికి, రైతుల కళ్లల్లో మట్టికొట్టిందన్నారు. ఇప్పటికే రైతులకు సంబంధించి అనేక పథకాలకు కత్తెర వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందించలేక చేతులెత్తేశారన్నారు. రైతులకు దారుణంగా వంచించిన చంద్రబాబుకు ఈసారి తప్పకుండా ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఎన్నికల్లో లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

కుండపోత

- పొంగిన మురుగునీటి కాలువలు
- రహదారిపై నిలిచిన వర్షం నీరు
- రాకపోకలకు అంతరాయం

ఆమదాలవలసలో శనివారం కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి పట్టణంలోని పలుచోట్ల మురుగునీటి కాలువల నుంచి నీరు రోడ్లపై ప్రవహించింది. సుమారు గంటన్నర పాటు వర్షం కురవడంతో పలు రహదారులు జలమయంగా మారాయి. ప్రధాన రహదారిపై వర్షంనీరు ఎక్కడకక్కడ నిలిచిపోవటంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడకక్కడే వర్షం నీరు నిల్వ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడ్డారు.

- ఆమదాలవలస రూరల్



తహసీల్దార్ కార్యాలయ వద్ద వర్షం కారణంగా పొంగిన మురుగునీటి కాలువ



కంద్రపేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు కాలువ



రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు



ఆమదాలవలస ప్రధాన రహదారిపై వర్షం నీటిలో ఉన్న ద్విచక్ర వాహనాలు

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

పాతపట్నం: స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు.
లచ్చన్న చిత్రపటానికి ఎంపీడీఓ పి.చంద్రకుమారి, డీటీ వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లచ్చన్న జయంతిని నిర్వహించారు.